"ఉన్న ఒక్క బస్సు టైమ్‌కి వచ్చి చావదు." విసుగ్గా చూసింది నీరజ.

"బావుంది. మనది అవసరం అని ." అంటుంటేనే ఎదురుగా నల్లని ఎంబాసిడర్ వచ్చి ఆగింది. రాధ కళ్ళల్లో నవ్వు కదిలింది. సన్నగా మోచేత్తో నీరజని తాకి "మీ బావకారు అదృష్టం అంటే మనదే!" అంది.

ఆ క్షణంలో అలాగ కారు రావటం, అందులో రాధ పక్కనవుండగా అసలు యిష్టంలేదు నీరజకి.

"ఇంటికేనా?" అంటూ తలుపు తెరిచాడు చంద్రశేఖరం.

"బస్సులో వెళ్ళిపోతాం" అంది నీరజ అయిష్టం దాచుకుంటూ.

"ఏం బస్‌పాటి చెయ్యదా నా కారు?" అంటూనే ఓ పలకరింపు చూపు రాధకేసి విసిరేసాడు అతను.

రోడ్డుమీద అలా నిలబడ్డం మరీ ఘోరంగా కన్పించి వెనక సీట్లోకి ఎక్కింది నీరజ. రాధ పక్కనే కూర్చుంది.

కారు సాగింది.

రాధని బ్రాడీపేట సెంటరులో దింపేసి తాలూకా ఆఫీసువైపు సాగించాడు కారు చంద్రం.

"నన్ను యింటిదగ్గర దింపెయ్యి. వెళ్ళిపోతా" అంది నీరజ ఖంగారుగా.

"వెళ్ళొచ్చులేవోయ్. అంత కంగారేం! ఇప్పట్నుంచి యింటికెళ్ళి ఏంచెయ్యాలిట? నాకూ మరీ కంపెనీ లేక బోర్‌గా వుంది." అన్నాడు నవ్వుతూ.

నీరజ సీట్‌కి జేరబడి కూర్చుంది.

"నువ్వు బొత్తిగా యింటివైపు రావటం మానేశావు."

"అక్కయ్య వుంటే..." నసిగింది నీరజ. అంతకన్నా యేమనాలో తోచక.

ఒక్క_క్షణం నిశ్శబ్దంగా వుండి పోయాడు చంద్రం.

"ఇంత సేపయినా పాప ఎలావుందని అడగవేం?" నీరజ సంభాషణ మార్చింది తెలివిగా.

సన్నగా నవ్వాడు చంద్రం. "పిన్ని గారి పెంపకంలో పాప ఎలావుందోనని వేరే అడగాలా?"

కారు నెమ్మదిగా గేట్ లోంచి పోర్టికోలో ప్రవేశించి ఆగింది. నీరజ వెనకనించి దిగింది.

చంద్రం కారు బాక్ చేసుకుంటూ "నువ్వు హాల్లో కూర్చో నీరజా. నేను షెడ్‌లో పెట్టేసివస్తా కారు," అన్నాడు. నీరజ లోపలికి నడిచింది.

ఇల్లు నిశ్శబ్దంగా వుంది. నిట్టూర్పు అప్రయత్నంగా వచ్చింది నీరజకి లోపలికి వెళ్ళి కూర్చుంటుంటే.

ఒకప్పుడు యీ యింటితో ఎంత సన్నిహిత సంబంధం వుండేది తనకి! వారంలో నాలుగు రోజులు అందమైన సాయంకాలాలు యిక్క_డ గడిచిపోయేవి. తను వచ్చేసరికి యిల్లు ఎంత గందరగోళంగా _ ఎంత కళకళ లాడుతూ వుండేది! పార్వతి పిల్లలతోపాటు పరిగెత్తుతూ... అరుస్తూ హైరానపడ్తూ

పుండటం కదూ! చంద్రం పార్వతిని ఎగతాళిపట్టిస్తూ నవ్వేవాడు. ఆ రోజులు ఎంత హాయిగా గడిచిపోయాయి! ఆ ఆనందం అంతా పార్వతితోటే వెళ్ళిపోయింది. ఇంక యీ యింట్లో మిగిలింది ఏమిటి?

"ఏమిటో, చాలా డీప్‌గా ఆలోచన్లో పడిపోయావు?" చంద్రం బట్టలు మార్చుకుని నల్లగళ్ళ లుంగీతో వచ్చాడు. అతని వెనకనే వంటతను కాఫీ కప్పులు తెచ్చి యిచ్చివెళ్ళాడు.

"ఇతని వంట తినాలంటే ప్రాణం మీదికి వస్తోంది." అంటూ ఎదురుగా కూర్చున్నాడు చంద్రం.

"అంత ఘోరమా?"

"అయినా కాకపోయినా రుచి మరిగి యిప్పుడు యిలా తినాలంటే కష్టంకదూ?"

కాఫీ పూర్తిచేసి నీరజ లేచింది 'వెళ్తాను' అంటూ.

"ఇదేమిటి? కాఫీ తాగి వెళ్ళిపోవ డానికా వచ్చింది! ఇంకా ఆరు అయినా కాలేదు. అంత హడావుడి పడిపోతావేం?"

"లేదు బావా! పాప ఒక్కతే స్కూల్‌నుంచి వచ్చివుంటుంది. నాన్న యింకా యింటికి వచ్చివుండరు. వెళ్లాలి." అంది బాగ్ వూపుతూ.

ఇద్దరూ లేచి వరండాలోకి వచ్చారు.

మేడమీదికి వొత్తుగా పాకిన మాలతీ తీగలోంచి తెల్లని పువ్వులు గుత్తులు గుత్తులుగా తొంగిచూస్తున్నాయి. ఎదుపు రంగుకు తిరుగుతున్న సూర్యకిరణాలు లేత ఆకుల్ని తళతళ లాడిస్తున్నాయి.

చంద్రం ఏదో అడగాలని మళ్లీ తటపటాయిస్తూ ఆగిపోయాడు గులాబి చిగుర్ని గోటితో నొక్కుతూ.

"నాన్నగారు ఏమీ చెప్పలేదా... నీరూ?" నెమ్మదిగా అడిగాడు ఓ క్షణం ఆగి.

కళ్ళు చిట్లించింది నీరజ. "ఏమిటి చెప్పేది? నా కేమీ తెలీదే!"

"సరే, సరే, అయితే!" అతని కళ్లల్లో నిరాశలాంటిది తొంగిచూసింది.

"ఏమిటి బావా అది?" ఆశ్చర్యంగా అడిగింది నీరజ.

"ఇంటిదాకా రానా? డ్రైవర్‌తో వెళ్ళిపోతావా?" చంద్రం మొహం అటు ప్రక్కకి తిప్పుకుంటూ అడిగాడు.

"వొద్దులే. వెళ్ళిపోతా!" అంది నీరజ ఏ విషయం గురించి మాట్లాడాలా అని ఆలోచిస్తూ.

* * *

జుట్టు చిక్కుతీసుకుంటూ అద్దం దగ్గిర నిలబడింది నీరజ. ఏడేళ్ళ పాప గౌను పైకిపట్టుకుని పరిగెట్టుకొచ్చింది "పిన్నీ, పిన్నీ!" అంటూ.

గౌనునిండా కుప్పగా పోసుకొచ్చిన పారిజాతాలు నీరజ ముందు కుమ్మరించింది "ఎన్ని పూలో!" అంటూ.

కొంచెంగా నలిగి కమిలినట్టున్న ఎరుపు తెలుపులతో పారిజాతాలు సువాసనలు చిమ్ముతున్నాయి.

"పిన్నీ, దండలు గుచ్చిపెట్టవూ?" అంది పూలవంకి మురిపెంగా చూసుకుంటూ. "పూలన్నీ చెట్టుకింద రాలాయి పిన్నీ, నేనూ సరూ ఏరాము. దానికి సగం యిచ్చా!" అంది పాప.

"మంచిపిల్ల" అంటూ నుదుగా పాప బుగ్గలు నిమిరింది నీరజ, అంతలో కిందనుంచి తండ్రిగొంతు విన్పించింది "పాపా!" అంటూ.

పాప తూనీగలా పరిగెట్టింది కిందికి మరుక్షణంలో పరిగెట్టుకొచ్చి రొప్పుతూ "పిన్నీ, తాతయ్య నిన్ను పిలుస్తున్నాడు" అంటూ మళ్లీ పరిగెట్టింది కిందికి.

నీరజ దువ్వెన టేబుల్‌మీద పడేసి జుట్టుముడేసుకుని కిందికి వెళ్ళింది. ఆనందరావు హాల్లోనే సోఫాలో కూర్చుని పేపర్ చూస్తున్నాడు.

"ఎందుకు నాన్నా?" అంది నీరజ మెట్లుదిగుతూ.

తలెత్తి చూశాడు ఆనందరావు. "పాప స్కూల్‌కి వెళ్ళిందా?" "వెళ్ళినట్టుంది"

చెప్పాలనుకుంటున్నాడు ఏదో చూసి.

"కూర్చో నీరూ! నీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు ఆనందరావు చాలా సీరియస్‌గా.

నీరజ ఎదురుగా కూర్చొంది, తండ్రి పడేసిన పేపరు చేతుల్లోకి తీసుకుని.

"నిన్న చంద్రందగ్గరికి వెళ్లావా?"

"నేను వెళ్ళలేదు. తోచటంలేదు రమ్మని తనే లాక్కువెళ్ళాడు."

"అవును పాపం. మరీ వొంటరి బ్రతుకు అయిపోయింది అతనిది. పాపనయినా పంపిద్దామంటే ఆడమనిషిలేని కొంపలో పసిపిల్లతో ఎలాగ?"

"ఇప్పుడు పాపకేం లోటయింది గనుక!"

"పాపకి కాదు. అతనికే లోటు." ఇద్దరు కొన్ని క్షణాలు మౌనంగా వుండి పోయారు. ఇద్దర్నీ పార్వతి జ్ఞాపకాలు కదిల్చాయి. ఆనందరావు తేరుకున్నాడు మొదటగా. "చంద్రం మళ్లీ పెళ్ళిచేసుకుంటే ఎలావుంటుందమ్మా నీరూ?"

రాత్రి బావ అన్నదానికి యిప్పుడు తండ్రి చెప్పేదానికి ఏదైనా సంబంధం వుందా అని ఆలోచిస్తున్న నీరజ పరధ్యాసగా "చేసుకోవచ్చు" అంది.

"అలా తేలిగ్గా అనటం కాదమ్మా! రెండోపెళ్ళి అంటే ఎంత బాధాకరమో ఆలోచించు. ఆ వచ్చే అమ్మాయి అనుకూలవతి అయివుండాలి! అతన్ని అర్థం చేసుకుని మళ్లీ పార్వతిస్థానాన్ని పొందగలిగేదిగా వుండాలి. ఏమంటావు?" పరిశీలనగా కూతుర్ని చూస్తూ అన్నాడు ఆనందరావు.

"నిజమే మరి. జీవితమంతా పంచుకోబోయే వ్యక్తికదా మరి! వచ్చిం దగ్గర్నుంచి చిటపటలతో గడిపితే కష్టమే!" సాలోచనగా అంది నీరజ.

"అందుకే నీరూ, నేనొకటి అనుకుంటున్నాను. చంద్రానికి యింకా ముప్పై అయిదు దాటలేదు. మనిషికూడ మంచివాడు, సంస్కారవంతుడు భవిష్యత్తులో పయికి వెళ్ళవలసినవాడు. అతన్ని చేసుకోబోయే ఆడది అదృష్టవంతురాలు కాదంటావా నీరూ?"

నీరజ మాట్లాడలేదు.

"ఆ వచ్చే అమ్మాయి పాపని బాగా చూస్తుందన్న నమ్మకంలేదు. పాప అయినా ఊహతెలుస్తున్న పిల్ల. నువ్వు శాశ్వతంగా యిక్కడ వుండవు కదా! నీ తర్వాత యీ ముసలితనంలో పాపని నేను పెంచటం సాధ్యపడదుకదా నీరూ..."ఆగాడు ఆనందరావు

నీరజ తండ్రివైపు నిశితంగా చూస్తోంది.

"నాకూ మంచిదనిపించింది ఆ పద్ధతి. పైగా అన్నింటికన్నా ముఖ్యంగా అతను ఎంతో యిష్టం కనపరిచాడు. నాకు అభ్యంతరం కన్పించలేదు. ఏమంటావ్"



నీరజ అదేదో వూహించని విషయం హఠాత్తుగా ఎదురయ్యేసరికి తట్టుకో నంతగా డీలాపడిపోయింది. మొహంలో రంగులు వెంట వెంటనే మారిపోయి చివరికి ఎరుపురంగు మిగిలిపోయింది.

"బావకి యిష్టం అని నీతో అన్నాడా?" ఎలాగో అంది నెమ్మదిగా.

"నేను పోరుతుంటేనే చివరికి నీరజ...అహ...నీకు యిష్టం...పూర్తి అంగీకారం అయితేనే అన్నాడు. నీ వుద్దేశ్యం చెబితే..."

"నాన్నా... ఇది నా పెళ్ళి సమస్య. బావ అంటే గౌరవంవుంది. కానీ ఆలో చించుకోవాలి. ప్లీజ్ "అంటూ వొణుకు తున్న పెదిమలు బిగించి లేచిపోయింది, నీరజ అక్కడ్నుంచి.

గదిలోకి వచ్చిపడిందన్నమాటే గానీ మనసు అంతా ఏదో తిక్క అలుము కున్నట్టుగా అయింది నీరజకి. ఏదో ఓమూల తెలీని విషాదం కదుల్తోంది. "అందుకేనా నిన్న చంద్రం అంత పట్టి పట్టి అడిగాడు! అందరి మనసుల్లో వుద్దే శ్యం అదన్నమాట. పారుని ఒక్క ఏడాదిలోనే మరిచిపోగలిగాడా. ఎంతగా ప్రేమించాడు తనని! అదే నిజం అయితే మరుపు ఎలాగ సాధ్యం! పైగా ఆ భార్య చెల్లెల్ని మళ్ళీ స్వంతంచేసుకోవా లను కోవటం ఎంత చిత్రం! పిచ్చిగాని, యిం దులో అంత విచిత్రం ఏముంది గనక ! ఏడాది నుంచి అతని కూతుర్ని తను

వెంటుతోంది. రక్త సంబంధం మమకారం వల్లకాని మరొకందుకు కానీ తరచు అతని ఎదుట తిరుగుతూ భార్యని గుర్తు తెస్తోంది. కానీ అంతవరకే ఆలోచించ గలిగాడు అతను. పెళ్ళిగురించి సంసారం గురించి తన ఆలోచనలే వేరు. తన ప్రపంచం వేరు. వైవాహిక జీవితం అంటే ఎన్నో కలలతో కోర్కెలతో వుండి, ఎదురు చూస్తోంది తను. అతను.? జీవితాన్ని కొద్దిగానీ, గొప్పగానీ కొంత వరకు అనుభవించి చప్పబడిన మనిషి। అతను పారు భర్త కావచ్చు. కానీ రెండో పెళ్ళివాడు. అందగాడే కావచ్చు. కానీ అతని అందం ఒకప్పుడు మరో స్త్రీ సొత్తు. తన కళ్ళ ఎదురుగా అతను పార్వతితో ప్రేమకలాపాలు సాగించాడు. వాళ్ళ సరదాలని సంతోషాల్ని కళ్ళారా చూసింది తను. రేపు అతన్ని పెళ్ళి చేసుకున్నా ఆ జ్ఞాపకాలు తనని వొదులుతాయా ? చంద్రాన్ని నిండు మనసుతో ఆరాధించ గలుతుందా ! లేదు లేదు .. తన హృదయం అంత విశాలం కాదు తనిని పెళ్ళిచేసుకునేవాడి హృదయంలో తను తప్ప మరో స్త్రీరూపం లీలగా అయినా తగలకూడదని కోరుకోవడం స్వార్థం ఎప్పటికీ కాదు.

పాప వచ్చి మీదపడటంతో నీరజ ఆలోచనలు ఆగిపోయాయి.

*   *   *

షాపింగ్ పూర్తిచేసుకుని రాధ-నీరజలు నెమ్మదిగా నడక సాగించారు యింటి వైపు.

"రాధా నాకో చిన్న సలహా కావాలే" నీరజ దిక్కులుచూస్తూ అంది.

"సలహాలు యివ్వటానికి మనం ఎవ్రరెడి" రాధ నవ్వింది.తన సమస్యని విప్పిచెప్పింది నీరజ నెమ్మదిగా.

"ఓ!" రాధ హుషారుగా చూసింది, "అయితే త్వరలోనే మా నీరజమ్మగారింట్లో పప్పన్నం అన్నమాట. ఎంత శుభవార్త?"

"ఛీ, వాగకు. గుండెలు మండి పోయి నేనుంటే పప్పన్నం అంటూ వాచిపోతున్నావ్. ఏదో ఫ్రెండువిగదా అని గోడుచెప్పుకుంటే" మధ్యలోనే ఆపేసింది రాధ. "ఎందుకమ్మా అంత గుండె మండిపోవటం! ఎంచక్కా పెళ్ళి కొడుకు అందమైనవాడు,కోరుకున్నవాడు పెళ్ళాం ఆడించినట్టు ఆడేవాడు!"

"కానీ రెండో పెళ్ళివాడు!"

"హుష్! అది ఓ అభ్యంతరమా! అయినా బాగా టచ్ వున్న మనిషి కదా! ఎంతమంది అమ్మాయిలకు పడుతుంది మనసుచదివిన మొగాడినేపొందగలగటం పైగా మా బావ సంస్కారం నీకు తెలియంది కాదుగదా"

"లేదు రాధా! బావ గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. పార్వతి వున్న రోజుల్లో తరచు వాళ్ళింటికి వెళ్ళినా ఆదారివేరు. అప్పుడు యిల్లు స్వీట్



హోముల వుండేది. నా కింకా కళ్ళ ముందే వున్నాయి ఆ సంఘటనలు. పార్వతిని ప్రాణంతో ప్రేమించాడు చంద్రం. అదొక్కటే నాకు తెలుసు"

"ఇంకా అంతకన్నా ఏం కావాలి నీరూ? భార్యని ప్రాణంలా ప్రేమించటం ఎంతమంది మొగుళ్ళకి చాతనవును."

"అబ్బ! నా బాధ నీకు అర్థంకాదు. పెళ్ళి అయి అయిదేళ్ళు సంసారంచేసి పార్వతి చచ్చిపోయి ఏడాది కాకుండానే మళ్లీ మరదల్ని కట్టుకునేందుకు యిష్టపడుతున్న అతని గురించి నా కెందుకో మంచిగా యింప్రెషన్ పడటంలేదు రాధా!

"అంటే నీ వుద్దేశ్యం జీవితాంతం అతను మీ అక్కనుతల్చుకుంటూ కుళ్ళి కృశించిపోవాలనా?" రాధ సూటిగా చూసింది.

"ఛ...ఛ! అలాగ నేనెప్పుడూ అనను. కాని తనకు తగ్గట్టుగా రెండో పెళ్ళిదాన్నో...మరొకర్నో ఎందుకు చేసుకోకూడదూ? పెళ్ళికాని పాతికేళ్ళ కన్యాకుమారే కావాలేం?" ఆవేశంగా అంది నీరజ.

"నీకు కోపం వస్తోంది. ఒక్కటి ఆలోచించు. వేరే అమ్మాయి అయితే అతని పిల్లల్ని నీలా చూస్తుందన్న గ్యారంటీ ఏమిటి? ఇద్దరి మధ్య చీకాకులే మిగిల్తే..."

"అయితే...? ఇప్పుడు పాడుపిల్లల కొచ్చిన లోటేమీ లేదుగదూ? నాతోపాటు

అంతేకానీ అతని పిల్లలకోసం నా ఇష్టాలు అభిరుచులు చంపుకోవాలా? చంద్రం నాన్నకి యీవిషయం అడిగాడని తెలిసిన దగ్గర్నుంచి నాకు అతనంటే ఒళ్లుమండి పోతోంది. మీరంతా సంస్కారవంతులని పొగుడుతున్నారే... ఆ సంస్కారం ఏమిటో నాకర్థంకావటంలేదు."

"అబ్బ... అంతగా ఫైరయిపోకే తల్లీ! నీ మెడలు వంచి ఎవ్వరూ బలవంతంగా కట్టబెట్టబోవటం లేదుగదా! ఇలా ముసుగులో గుద్దులాటరన్నా హాయిగా అతన్తోనే ఫ్రీగా మాట్లాడ రాదూ?"

"నిజమే!" అంది నీరజ రుమాల్తో మొహం తుడుచుకుంటూ.

"లోపలికి వస్తావా?" అడిగింది రాధ గేటుతెరుస్తూ.

"వొద్దులే" అంటూ ఆగిపోయింది నీరజ.

"ఏమైనా బంగారంలాంటి సంబంధం వొదులుకోవడం నాకేం యిష్టంలేదు." రాధ ఉడ్వింపుగా నవ్వి లోపలికి వెళ్ళి పోయింది.

నీరజ మొహం ఎర్రనయింది కోపంతో. "నీ మొహం!" అనుకుని యింటిదారి పట్టింది.

* * *

ఆ రోజు ఆదివారం. నీరజ రెండు గంటలు అవగానే పడుకున్నదల్లా లేచి కూర్చుంది. అంతవరకు ఆలోచనలతో సతమతమయిపోతున్న మనసు ఒక్కసారి విచ్చిపోయిన మబ్బులా అయింది.

మంచం దిగి హుషారుగా పాట పాడుతూ టవల్ తీసుకుని బాత్ రూమ్ లోకి పరిగెట్టింది.

జడ అల్లుకుని చీర మార్చుకుందామని ఓ క్షణం బీరువాదగ్గర నిలబడి మళ్ళీ ఆ ఆలోచన ముగించి అలాగే చెప్పులు వేసుకుని బయల్దేరింది.

క్రింద హాల్లో కూర్చుని బొమ్మలు చూసుకుంటున్న పాప తలెత్తి "పిన్నీ. ఎక్కడికి?" అని అడిగింది.

"రాధ దగ్గరికే. ఇప్పుడే వచ్చేస్తాగా! ఆడుకో ఏం?" అంటూ బైటికి నడిచింది.

* * *

ఎర్రనికళ్ళతో తలుపుతీసిన చంద్రశేఖరం ఎదురుగా నీరజని చూసి క్షణం సేపు ఆశ్చర్యపడి "రా, రా, ఎంత అదృష్టం!" అన్నాడు.

"ఏమిటి అదృష్టం!" అంటూ లోపలికి నడిచింది నీరజ అతని వెంట. సోఫాలో కూలబడింది వుసూరుమంటూ.

"ఏదైనా డ్రింకు కావాలా?" చంద్రం అడిగాడు. "బాగా ఎండలో వచ్చావు... ఇప్పుడుతప్ప తీరలేదా?"

"నీతో ఓ ముఖ్యవిషయం మాట్లాడాలి బావా!" నెమ్మదిగా అంది నీరజ కళ్ళు వాల్చుకుని. మొహం ఎర్రనయింది.



ఛీ. ఛీ... ఎంత దౌర్భాగ్యమైన అబద్ధం తను చెప్పబోయేది! ఇన్నాళ్ళ బాధ యిప్పుడు తేలిపోతుంది బావయిచ్చే సమాధానంతో.

చంద్రం కళ్లు మెరిసాయి. "ఇంకేం ముఖ్యవిషయం అయివుంటుంది. తప్పకుండా అదే!" ఆశగా ఆమె ఎఱ్ఱబడిన మొహంకేసి చూస్తూ కూర్చున్నాడు చంద్రం.

ప్రారంభించింది నీరజ. "నాన్న చెప్పాడు బావా! పార్వతిస్థానం పొందగలగటం నాకూ యిష్టమే! నీ బోటి వ్యక్తిని భర్తగా ఆశించటం నిజంగా దురాశే! నీ మంచితనం, నీ సంస్కారం నాకు తెలియనివికావు"

చటుక్కున చంద్రం లేచాడు "నిజం! నువ్వు మనఃపూర్వకంగా యిష్టపడ్తున్నావా నీరూ! చెప్పు. నాకెందుకో నమ్మశక్యంగా లేదు."

...అదృష్టం వస్తానన అంటూంటే కాలదన్నే మూర్ఖురాలినా? కానీ..."

"రెండో పెళ్ళివాడినని నీకేం అభ్యంతరం లేదూ?"

"అలా అనుకుంటే నాలో లోపాలు లేవూ! నిన్ను మభ్యపెట్టటం నాకుయిష్టం లేదు బావా! నువ్వు అనుకునేటంత గొప్పతనం నాకులేదు. ఆ విషయం నీకు చెప్పకుండా నిన్ను స్వంతం చేసుకోవాలనుకోవటం కటిక స్వార్థమే! పైగా ఇంకో మనిషిద్వారా ఈ విషయం నీ చెవినబడితే నా భావిజీవితానికి అది పెద్ద ప్రమాదంగా పరిణమించగలదు."

"అంటే......?" అర్థం కానట్టు చూశాడు చంద్రం.

"అది నేను పి.యు.సి. చదివే రోజులు... అంటే అయిదేళ్ల క్రితం అన్నమాట. రాధ తెలుసుగదా నీకు! మేమిద్దరం అయిదోక్లాసు నుంచి ఫ్రెండ్సుమే! మేం పి.యు.సి. చదివేటప్పుడు సుందరం సెకెండు బి.ఎ.లో వున్నాడు." నీరజ ఓరగా తలెత్తి చంద్రంవైపు చూసింది.

అతను రెప్ప వెయ్యకుండా యిటే చూస్తున్నాడు.

"నీ దగ్గర దాచటం నా కిష్టం లేదు బావా! ఆ సుందరము...నేనూ ఒకప్పుడు కలిసి తిరిగాము. స్నేహం కాదు అది కేవలం. సుందరం నేనంటే ప్రాణం యిచ్చేవాడు. అందరికి యిష్టం అయితే యిద్దరం పెళ్లి చేసుకోవాలనుకున్నాం... కానీ సుందరం......" నీరజ గొంతు వొణికింది.

"ఏమైంది?" ఆదుర్దాగా అడిగాడు చంద్రం.

"సుందరం కలరా తగిలి చచ్చిపోయాడు అప్పుడే. నా కలలన్నీ కూలిపోయాయి అతన్తోపాటే. తర్వాత మళ్లీ ఎవ్వరెంత బలవంతపెట్టినా పెళ్లి చేసుకోలేక పోయాను. విముఖత వల్లే కేవలం!"

"మరి యిప్పుడు ఎలాగ వొప్పుకుంటున్నావు?"

"నాన్నని యింకా బాధ పెట్టటం యిష్టంలేదు, బావా! పెద్దవాడయిపోయాడు, చూడు. కాకపోయినా నా జీవితానికీ ఓ తోడు కావాలనిపించింది. సుందరం జ్ఞాపకాలు యిప్పుడే మర్చిపోగలుగుతున్నాను."

"అతన్ని అంతగా ప్రేమించావా నీరజా!" చంద్రం గొంతులో ఏదో మార్పు వచ్చినట్టుగా తోచింది నీరజకి.

"నువ్వు పార్వతిని ప్రేమించినట్టుగా!"

చంద్రం ఏమీ అనలేదు. తెల్లని పాదాలమీద జీరాడుతోన్న నల్లజరీ చీరను చూస్తూ కూర్చున్నాడు.

నీరజ లేచింది. "వస్తా బావా! ఎంత వొద్దనుకున్నా అంతరాత్మ వొప్పుకో



లేదు. అయినా నీ మంచితనం పట్ల నాకు గల విశ్వాసంతో చెప్తున్నాను. నాకు మాత్రం నీ జీవితంలో ప్రవేశించటం గొప్ప అదృష్టంగా తోస్తోంది."

"మామయ్యకితెలుసా యీవిషయం?" చంద్రం అడిగాడు తనూ లేస్తూ.

"తెలుసు. అందుకే యిన్నాళ్లూ నా పెళ్లి గురించి తొందర పెట్టలేదు తను".

* * *

తండ్రి పోస్టు చూసుకుంటున్నాడు క్రింద గదిలో.

నీరజ ఎదురుగా కూర్చుంది వెళ్లి.

తలెత్తి చూసి నవ్వి మళ్లీ వుత్తరాల్లో పడ్డాడు ఆయన.

"బావని కలిశావా నాన్నా?" అడిగింది నీరజ, కళ్లుదించి తండ్రి పాదాలకేసి చూస్తూ. ఇలాంటి విషయాల్లో తల్లి లేని లోటు బాగా తెలుస్తుంది ఆడపిల్లకి. తన పెళ్లి విషయం తనే మాట్లాడుకోవటం అందులో తండ్రితో అంటే మరీ సిగ్గు-అసహ్యం!

"లేదమ్మా! అతను మళ్లీ నాకని పిస్తేనా? ఆరోజు నువ్వు ఒప్పుకున్నావని చెప్పాను. సంతోషం అన్నాడు. మళ్లీ కనపడలేదు. రెండుసార్లు ఫోను మీద దొరకలేదు. బిజీగా వున్నాడేమో. ఇవాళన్నా యింటికి వెళ్లి రావాలి. ఇష్టమయ్యాక యింకా ఆలశ్యంఎందుకు? "బావ మనసు మళ్లీ మారిందేమో అది చూశావా నాన్నా!" నీరజ కళ్లల్లో ఎక్కడో వెక్కిరింపు నవ్వు మెరిసి మాయ మయింది

"ఇదీ మరీబాగుంది. క్షణంలో మూడ్ మారిపోవడానికి ఇదేం పెళ్లా యింకోటా? ఇవాళ తేల్చేయనూ!" ఆనందరావు కుర్చీలోంచి లేచాడు. "నాకు మాత్రం

ని అంగీకారం చాలా ఆనందంగా వుంది నీరూ! పార్వతి కూడా పైనుంచి సంతోషిస్తుంది ఎంతో!" "గెలుపు బావదే అయితే అతన్ని చేసుకోవడం కన్నా అదృష్టం లేదు నాకు. కానీ నేను గెలిస్తే మాత్రం యింక సమస్యే లేదు."

"అదేమిటి! ఏమైనా పందెమా?" ఆనందరావు ఆశ్చర్యంగా చూశాడు.

"నేనూ–రాధ పందెం వేసుకున్నాం" అంటూ అక్కడ్నుంచి లేచి వచ్చేసింది నీరజ.

పదిరోజులు గడిచిపోయాయి. చంద్రశేఖరం దగ్గర్నుంచి ఎలాంటి సమాధానమూ రాలేదు. ఆనందరావు ఆరాటపడుతూంటే నవ్వుకుంది నీరజ. "పిచ్చి నాన్నా! అబ్బాయిగారి అసలురంగు తెలీదు పాపం" అనుకుని.

* * *

చంద్రం—

నువ్వు, నాన్నకి రాసిన వుత్తరం చూశాను. పెళ్లి చేసుకునే వుద్దేశ్యం లేదని......పార్వతి ప్రతిరూపమయిన నీరజని అసలు చేసుకోలేనని అన్నావు. నీ మారిన మనసుకి చాలా సంతోషం. ఇదేమన్నా కూరలబేరం అనుకున్నావా బావా? నువ్వు అవుననగానే అందలం ఎక్కి నీచుట్టూ తిరిగి నిన్ను తప్ప చేసుకోను అనే అమ్మాయి కావాలా నీకు?

నిజంగా నాకిప్పుడు వెర్రి ఆనందంగా వుంది నువ్వు కాదనటం. అంతకన్నా అదృష్టంలేదు అంటున్నాను యిప్పుడు. నేనొక చిన్న అబద్ధం ఆడకపోయినట్లయితే–సుందరం అనే వ్యక్తిని సృష్టించి వుండకపోయినట్టయితే ఎంత మోసం జరిగివుండేదో తల్చుకుంటుంటే... ?

అందము–డబ్బు కాదు బావా ప్రధానం. మంచి విశాలమయిన మనసు వుండగలగాలి. నీ మనసుకి తుప్పుపట్టింది. అయిదేళ్ళు ఒక భార్యతో కాపరంచేసిన నిన్ను పెళ్లిచేసుకోడానికి ఏ ఆడదానికయినా అభ్యంతరం వుంటుందేమో అన్న ఆలోచన అయినా నీకు తట్టలేదు. కానీ నువ్వు పెళ్లాడబోయే అమ్మాయి మాత్రం మానసికంగా శారీరకంగా అతి పవిత్రంగావుండాలి కదూ? ఎంతస్వార్థం! ఎంత దురాశ! నీ అందం వెనక యింత అల్పమయిన మనసు వుందని నేనుకల్లో కూడా అనుకోలేదు. సుందరాన్ని ప్రేమించటమే నీకు అపరాధంలా కన్పించిందే, మరి పార్వతితో సంసారం చేసి ఇద్దరు పిల్లల్ని కన్నావే...నాకేమీ అభ్యంతరం వుండదని నీకెలా తెలుసు. స్త్రీకి ఒక్కదానికే కాదు శీలం అనేది. పురుషుడికీ ముఖ్యమే!

నీకూ నీ సంస్కారానికి వెయ్యి నమస్కారాలు. మనం యిద్దరం నీరజ, చంద్రశేఖరంలాగే వుందాము. నాకూ నా కాబోయే భర్తగురించి ఎన్నో ఆలోచనలు, కోరికలు వున్నాయి. నువ్వు నా నుంచి ఆశించిన పవిత్రత, నేనూ అతి

కాదు.
—నీరజ.

చంద్రశేఖరం మొహం ఎర్రనయిపోయింది. ఉత్తరం నలిపి కసిగా విసిరేశాడు అవతలివైపుకి. ఎంత అవమానం అనుకుంటూ.

బహుకాల దర్శనం అంటూ రాధముందు కారు ఆపాడు చంద్రశేఖరం. రిక్షా కోసం చూస్తున్న రాధ మొహమాటంగా నమస్కారం చేసి "తలుపు తెరుస్తుంటే రిక్షాలో వెళ్ళిపోతానులెండి" అంది.

"ఫర్వాలేదు రండి" అంటూ బలవంత పెట్టాడు అతను.

రాధ యింక తప్పక ఎక్కి కూర్చుంది వెనక సీట్లో.

"నీరజతో స్నేహం మానేశారా ఏం యిప్పుడు? అదోలా నవ్వుతూ అడిగాడు చంద్రం.

"అరే మీకు తెలీదా? నీరూ అనంతపూర్‌లో లెక్చరర్ పోస్టులో చేరటం కోసం వెళ్ళి వారం పైగా అయింది. ఆనందరావుగారు, పాపకూడ యిక్కడ యిల్లు రెంట్‌కిచ్చేసి వెళ్లారనుకుంటాను.'

కెళ్ళారు?" తీవ్రంగా చూశాడు చంద్రం.

"సారీ. నాకు తెలీదు. అయినా, మీకు అభ్యంతరం లేకపోతేనే!" రాధ మనసు చివుక్కుమంది అతనికోపం చూస్తే. నీరూ పొరపాటు పడలేదేమో అనిపించింది మొదటిసారిగా.

"మిమ్మల్ని ఓ విషయం అడగాలనుకుంటున్నాను. మీకు సుందరం అనే బ్రదర్ వుండేవాడు కదూ?" చంద్రం కుతూహలంగా చూశాడు.

"నాకా! సుందరమా?" ఫక్కున నవ్వింది రాధ. "మా అమ్మ మొగపిల్లల కోసం కలవరించటం మొన్నటి వరకు నాకు గుర్తే. అదేం ఖర్మో కనీసం రెండో ఆడపిల్ల అయినా పుట్టలేదు. [illegible] ఓ అన్నయ్యా.. [illegible] రాధ మళ్ళీ నవ్వింది.

"సుందరమనే అతన్ని సృష్టించకపోతే...?" నీరజ మాటలు కళ్ళముందు మెదిలాయి. "నేను ఓడిపోయాను నీరూ?" అనుకున్నాడు చంద్రం పశ్చాత్తాపంతో.

అతని కళ్ళలో సిగ్గులాంటి భావం స్పష్టంగా గమనించింది రాధ.